క్లుప్తంగా

దేవరాపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా ఆనందరావు



దేవరాపల్లి: స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌గా జి. ఆనందరావు శుక్రవారం బాధ్యత లు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన గొలుగొండ మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. స్థానిక తహసీల్దార్ లక్ష్మీనారాయణను కలిసి విధుల్లో చేరారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన ఎస్. సురేష్ నాతవరం బదిలీపై వెళ్లారు.

త్వరితగతిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



మాట్లాడుతున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

రోలుగుంట: ఆరోగ్యశ్రీ కార్డులను త్వరితగతిన పంపిణీ చేయించాలని నర్సీపట్నం డివిజన్ లెవల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) ఉదయశ్రీ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె వారుతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. దానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమాలను పర్యవేక్షించి త్వరితగతిన అందరికీ అందించాలని ఈవోపీఆర్డీ నూకరాజుకు సూచించారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన

కె.కోటపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలో ఓటు వినియోగించుకోవడంలో ఓటర్లు ఆందోళనకు గురికావద్దని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం రొంగలినాయుడుపాలెంలో ఈవీఎం ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌లో భాగంగా 315 మంది ఓటర్లతో ఓటు హక్కు వేయించారు. వీఆర్వో కామరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యడ్లవానిపాలెంలో రామాలయ నిర్మాణం

- పరిశీలించిన టీటీడీ అధికారులు



గ్రామస్తులతో సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ

కె.కోటపాడు: యడ్లవానిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయాన్ని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ ఎస్.కె.చంద్రమౌళీశ్వరశర్మ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ సీతారామ, ఆంజేయస్వామి విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తమ దృష్టికి తీసుకొచ్చినట్టు చంద్రమౌళీశ్వరశర్మ తెలిపారు. సిబ్బంది సత్యనారాయణ, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వెంకటరావు, యడ్ల ముత్యాలనాయుడు(సీసీ) పాల్గొన్నారు.

భారీ ప్రమాదాన్ని ఆపిన డివైడర్



డివైడర్‌ను ఢీకొట్టి ఆగిన లారీ

మాకవరపాలెం: రోడ్డు మధ్యలో డివైడర్ భారీ ప్రమాదాన్ని ఆపింది. నర్సీపట్నం వైపు నుంచి నిత్యం భారీ రాళ్లలోడుతో లారీలు తాళ్లపాలెం వైపు వెళ్తుంటాయి. శుక్రవారం సాయంత్రం మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండు వద్దకు రాగానే రాయిలోడు లారీ ముందు చక్రాల సాఫ్ట్ వదిలేయడంతో ఒక్కసారిగా అదుపుతప్పింది. దీంతో పక్కనే డివైడర్‌ను చక్రం ఢీకొట్టడంతో ఆగింది. లేకుంటే పక్కనే దుకాణాలపైకి లారీ దూసుకు వెళ్లేది. డివైడర్ భారీ ప్రమాదాన్ని అడ్డుకుందని స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చీడికాడ: తురువోలు గ్రామ శివారులో బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్సై నారాయణ రావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం తమ సిబ్బందితో దాడులు చేయగా, సారా తయారీకి ఉపయోగించే 20 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటలు, సామగ్రిని ధ్వంసం చేశామన్నారు. వీటిని ఉంచిన వారిపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

'మోడల్'లో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: మంచాల ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ప్రవేశాల కోసం ఐదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. వచ్చే నెల 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని, వచ్చిన మార్కులు ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.



చోడవరం రూరల్: పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు



దేవరాపల్లిలో నోటీస్ బోర్డులో పరీక్ష గదిని చూసుకుంటున్న విద్యార్థులు



దేవరాపల్లి పరీక్ష కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న కె.కోటపాడు సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ నాగేంద్ర

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- గంట ముందుగానే చేరుకున్న విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు
- పటిష్టంగా పోలీసు బందోబస్తు

నర్సీపట్నం: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్న అధికారుల ఆదేశాలతో విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు. నర్సీపట్నం టౌన్‌లో ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసారు. తొలి రోజు నోటీసు బోర్డులో రూమ్ నంబర్లు చూసుకునేందుకు పోటీ పడ్డారు. వీరంతా తమ తల్లిదండ్రులతో తరలి రావడంతో పరీక్ష కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. ఇక్కడ ప్రధాన గేట్ల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పోలీసులు లోపలికి పంపారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా బెంచీలు, తాగునీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 591 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 577 మంది హాజరయ్యారు. 14 మంది తొలి రోజు పరీక్షకు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు కొత్తూరు జంక్షన్‌లోని ఉషోదయ, శ్రీవిజ్ఞాన్, వ్యాపారవీధిలోని సాయిప్రకాష్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ ఎస్. సూర్యనారాయణ పర్యవేక్షించారు.



గొలుగొండ: నిఘా ఏర్పాటు చేసిన నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎస్‌ఐ కృష్ణారావు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో తొలిరోజు ఇంటర్ పరీక్షకు 247 మందికిగాను 225 మంది విద్యార్థులు హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పి. ఉమామహేశ్వరి తెలిపారు. ఇక్కడ పరిసరాలను కె.కోటపాడు సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ డి. నాగేంద్ర పరిశీలించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని, 261 మంది విద్యార్థులకుగాను 11 గదుల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాల కేంద్రంలో తొలి రోజు 211 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 209 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ వసుదేవుడు తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, బెంచీలు, ఫ్యాన్లు, ఫస్ట్ ఎయిడ్, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించారు.

రావికమతం: కొత్తకోట జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడికి రోలుగుంట కళాశాల, రావికమతం, రోలుగుంట కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు మొత్తం 282 మంది హాజరయ్యారు. వీరిలో ఆరుగురు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. 22 సీసీకెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. కొత్తకోట పోలీసు స్టేషన్ సిబ్బంది, సచివాలయ పోలీసులు బందోబస్తు చేస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా శర్మ పర్యవేక్షిస్తున్నారు.

గొలుగొండ: కృష్ణదేవిపేట జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్ విద్యార్థులు 226 మందికిగాను ఏడుగురు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ గంగరాజు తెలిపారు. ఏజెన్సీకి ముఖద్వారం కావడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నర్సీపట్నం రూరల్ సీఐ బి. హరి, ఎస్‌ఐ కృష్ణారావు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు.

మాడుగుల: స్థానిక జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు తెలుగు పరీక్షలకు 238 మందికిగాను 228 హాజరైనట్టు ప్రిన్సిపాల్ వి. నాగమోహిని తెలిపారు.

సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు

- డ్వామా ఏపీడీ శ్రీనివాసరావు



గిరిజనులతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు

దేవరాపల్లి: జాబ్ కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా పామాయిల్, వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను సరఫరా చేస్తామని డ్వామా ఏపీడీ బి. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం దేవరాపల్లి ఉపాధి హామీ కార్యాలయానికి విచ్చేసిన ఆయన వాలాబు పంచాయతీ ఇప్పగరువులో క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో పామాయిల్, సీతాఫలం, జీడిమామిడి, మామిడి, సపోట, స్వీట్ ఆరెంజ్, డ్రాగన్ ఫ్రూట్, హైబ్రిడ్ చింత, తైవాన్ జామ, అవకాడో, నిమ్మ తదితర పండ్ల మొక్కలను అందజేస్తామన్నారు. మల్లె, గులాబీ పూల మొక్కలతో పాటు పందిర్లపై తీగ జాతి కాయగూర మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. మొక్కల సంరక్షణకు, నీటి తడులకు ఉపాధి హామీ ద్వారా సొమ్ము అందిస్తామన్నారు. డ్రాగన్ ఫ్రూట్, పందిర్లపై తీగజాతి కాయగూరల సాగుకు గొయ్యిల తవ్వించడంతోపాటు అవసరమైన స్తంభాలు సైతం ఉచితంగా అందజేస్తామన్నారు. పూల మొక్కలు పెంపకం, పశుగ్రాసం పెంపకానికి 25 సెంట్లు నుంచి 2 ఎకరాల విస్తీర్ణం వరకు మొక్కలు సరఫరా అందజేస్తామన్నారు. ఈయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ డి. ప్రసాద్ ఉన్నారు.

పోలియో చుక్కలపై అవగాహన ర్యాలీ



తూటిపాలలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 3న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. హెచ్‌ఎం రాము, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: ఈ నెల 3న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ కోరారు. జోగుంపేట జంక్షన్‌లో ఆయన అవగాహన కల్పించారు. గొలుగొండ ఐసీడీఎస్ పీవో గౌరిశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల: పల్స్ పోలియో విజయవంతానికి ప్రజలు సహకరించాలని కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఎం. నాయుడు తెలిపారు. శుక్రవారం కింతలిలో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలోని 28 బూత్‌లలో 2,326 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. వైద్యాధికారి రవితేజ, సీహెచ్‌వో అన్నపూర్ణ, హెచ్‌ఎస్ కె. మహేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పేదల సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్

ఇద్దరికి రూ.5 లక్షల చెక్కుల అందజేసిన డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: పేదల సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్ అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఇద్దరు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కులను ఆయన శుక్రవారం అందజేశారు. కె.కోటపాడులో గత నెల 1న గడప గడపకు కార్యక్రమంలో వీర్ని మజ్జిగౌరి తన ఆవేదన వ్యక్తం చేశాడు. రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి కుటుంబానికి భారంగా మారినట్లు వాపోయాడు. అదేవిధంగా అదే నెల 17న పిండ్రంగిలో పర్యటించిన డిప్యూటీ సీఎంను కలిసి లెక్కల అప్పలరమణ విన్నవించాడు. రోడ్డు ప్రమాదంలో తాను కుడి చేతిని కోల్పోయినట్టు వాపోయాడు. వీరి ఆర్థిక పరిస్థితులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధి కింద అప్పలరమణకు రూ.3 లక్షలు, మజ్జిగౌరికి రూ.2 లక్షల చొప్పున మంజూరు చేయించారు. వీరికి స్వయంగా చెక్కులు అందించారు. రెండు కుటుంబాలతోపాటు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి, శ్రీకాంత్ శ్రీను, బండారు లక్ష్మణరావు, వంటాకు అప్పాజీ, వంటాకు శ్రీను, వర్రి రామునాయుడు, వార్డు మెంబర్ కణిత మణిమాల, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగౌరికి చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

ప్రధాన సమస్యలన్నీ త్వరితగతిన పరిష్కారం


నాతవరం: ప్రజల మన్ననలు పొందేలా మెరుగైన సేవలందించాలని వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో జాగారపు రాంబాబు సూచించారు. చమ్మచింత గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయంలో సేవలపై ఆరా తీశారు. ఈ క్రమంలో గ్రామంలో ప్రధాన సమస్యలను వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే గణేష్ సహకారంతో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. కొన్ని అసంపూర్తి నిర్మాణాలతో ఉన్నాయని, వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సంక్షేమ, అభివృద్ధి పనులపై శాఖల వారీగా చర్చించారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన

నర్సీపట్నం: చెట్టుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం శుక్రవారం ప్రారంభించారు. అనంతరం శిబిరంలో వైద్యులు కె.ధనలక్ష్మి, ఎస్.స్వాతి(ఈఎన్‌టీ), కె.కుమారి(అప్తాలమిస్టు), హనుతేజ (ఆర్థోపెడిక్) 375 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇన్నం రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 384 మందికి వైద్య సేవలు అందించారు. వారిలో ఇద్దరికి ఉన్నత వైద్యం అందించేందుకు గుర్తించారు. ప్రతి గురువారం ఐరన్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు వైద్యాధికారి చరిష్మ చెప్పారు. మాజీ సర్పంచ్ పోతల వెంకునాయుడు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: జగనన్న ఆరోగ్య సురక్షతో నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి తెలిపారు. జోగుంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహించారు. సాలికమల్లవరం, జోగుంపేట పంచాయతీల నుంచి 290 మంది రోగులను వైద్యాధికారి శ్యామ్ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు జువ్వల లక్ష్మి, పెదిరెడ్ల లక్ష్మి, వైద్య సిబ్బంది, సిహెచ్‌వో ప్రసాద్, ఐసీడీఎస్ పీవో గౌరిశ్రీ పాల్గొన్నారు.



నర్సీపట్నం: ఆరోగ్య సురక్ష బ్యాగ్‌లను ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ రత్నం, వైద్య సిబ్బంది

కె.కోటపాడు: పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కింతాడలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. మందులను పరిశీలించారు. చౌడువాడ పీహెచ్‌సీ డాక్టరు నిర్మల, అప్తాలమిస్టు రాజీవ్, ఆర్థోపెడిక్ డాక్టరు నందకిశోర్, సుబ్రహ్మణ్యం 278 మందికి వైద్య సేవలందించారు. సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

చీడికాడ: జగనన్న ఆరోగ్య సురక్షతో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. శుక్రవారం ఖండివరంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీ గెంజి స్వాతిలతో కలిసి ప్రారంభించారు. వైద్యులు 310 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వరి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మోసూరి సన్నిబాబు, పార్టీ సీనియర్ నేత సుంకర శ్రీను, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేకు సూర్యనారాయణ, గెంజి బాలాజీ, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు మనకే ఉంది

- ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలి
- మేము సిద్ధం.. మా బూత్ సిద్ధంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: ఎన్నికలకు బూత్ లెవెల్‌లో ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం శుక్రవారం రావికమతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 40 రోజుల్లో ఎన్నికలకు అంతా సిద్ధం కావాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు బోగస్ ఓట్లు చేర్పించినట్లయితే తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. వలసవెళ్లిన బంధువులు, మిత్రులను స్వగ్రామాలకు రప్పించి కచ్చితంగా మన పార్టీకే ఓటు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, పార్టీ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మత్స భవానీప్రసాద్, నాయకులు రుత్తల బాపునాయుడు, గర్రెడ్డి తాతబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన కొమరవోలులో మండల స్థాయిలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని మాట్లాడుతూ నవరత్నాలు అమలు, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందన్నారు. రోలుగుంట మండలంలోనే రూ.700 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఓటు అడిగే హక్కు మనకే ఉందన్నారు. 45 రోజులు కష్టపడండి, ఓటు హక్కు ఉన్నవారిని గుర్తించి ఈ నెల 10వ తేదీలోపు ఓటరుగా చేర్పండి, డెత్‌లు ఉంటే తొలగించండి, దివ్యాంగులను కలవండి, ఓటర్లు మన పాలనపైనే మొగ్గు చూపుతున్నారు. కేడర్, లీడర్, అభిమానులతో కలిసి సమష్టిగా పని చేసి, రానున్న ఎన్నికల్లో మన పార్టీని విజయ ఢంకా మోగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వలంటీర్ల మండల కన్వీనర్ మడ్డు అప్పలనాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి. రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, శెట్టి సత్యనారాయణమూర్తి, గొర్లె చెల్లంనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు

మాకవరపాలెం ఎంపీడీవోగా చంద్రరావు

మాకవరపాలెం: ఎంపీడీవోగా చంద్రరావు నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న అరుణశ్రీ పదోన్నతిపై బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి ఇన్‌చార్జిగా కొనసాగగా, ఇటీవల నర్సీపట్నం ఎంపీడీవో జాన్ లింకన్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా భామినిలో పనిచేస్తున్న చంద్రరావును మాకవరపాలెం ఎంపీడీవోగా నియమించడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా అడవిరాజులబాబు పండగ



నాతవరంలో అడవిరాజులబాబును దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే అడవిరాజుల బాబు పండగ భక్తిశ్రద్ధలతో జరిగింది. మండలంలో నాతవరం, మర్రిపాలెం, వెన్నలపాలెం, ములగపూడి, ఎం.బి.పట్నం, సరుగుడు గ్రామాల్లో ఈ పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్నేహితులు, బంధువుల రాకతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా శక్తి వేషాలు, మహిళల కోలాటం, నేలడ్యాన్స్ చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సర్వాంగ సుందరంగా తయారైన ఆయా గ్రామాల్లో ఆలయాల్లో అడవిరాజులబాబును దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. కనులు మిరుమిట్లుగొలిపే విధంగా బాణసంచా కాల్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆనందమని 'పింఛన్'

- ఠంఛన్‌గా ఒకటో తేదీన పంపిణీ
- వలంటీర్ల చొరవతో ఏకకాలంలో వేగవంతం



చోడవరంలో పింఛన్ ఇస్తున్న వలంటీర్



పింఛన్ ఇస్తున్న వలంటీర్

చోడవరం: పింఛనుదారుల్లో ఆనందం వెల్లువిరిసింది. ఠంఛన్‌గా ఒకటో తేదీనే పింఛన్ డబ్బులు చేతికి అందడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు. జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ డబ్బును ఏటా పెంచుతూ ఇస్తున్న విషయం తెలిసిందే. ఒక్కొక్క పింఛన్‌దారుకు రూ. 3 వేల చొప్పున శుక్రవారం వలంటీర్లంతా గ్రామాల్లో పంపిణీ చేశారు. చోడవరం నియోజకవర్గంలో 12 కోట్ల 61 లక్షల 96 వేల రూపాయల పింఛన్ సొమ్మును 46,248 మంది పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేపట్టారు. చోడవరం మండలంలో 13,247 మంది, బుచ్చెయ్యపేటలో 11,903 మంది, రావికమతంలో 11,680 మంది, రోలుగుంటలో 9,358 మందికి పెంచిన పింఛన్ మంజూరైంది. నాలుగు మండలాల్లో 1,278 గ్రామ వలంటీర్లు ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే పింఛన్లు పంపిణీ మొదలు కావడంతో ఒక్క రోజులోనే 89 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల రూరల్: పొద్దుకూయక ముందే వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి తాటిపర్తి, తదితర గిరిజన గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో తొలిరోజు 80 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.



తాటిపర్తి పంచాయతీ ద్వారకనగర్‌లో పింఛను అందజేస్తున్న వలంటీరు కొండమ్మ

కనుల పండువగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

చోడవరం: గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు కనుల పండువగా శుక్రవారం జరిగింది. స్థానిక చినబజార్ వీధిలో ఏటా గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని నెలకొల్పి భారీ ఎత్తున ఉత్సవం నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం గౌరీపరమేశ్వరుల ఉత్సవం కావడంతో ముందురోజు అమ్మవారికి సారె ఊరేగింపుగా తీసుకొచ్చారు. పట్టణంలోని అన్ని వీధుల నుంచి పెద్ద ఎత్తున మహిళలు సారె ఊరేగింపులో పాల్గొన్నారు. రకరకాల పండ్లు, మిఠాయిలు, పూలు, కొబ్బరి, అరటిగెలలు, చీరలు, పిండివంటకాలతో అమ్మవారి సారె ఊరేగింపు కనుల పండువగా సాగింది. అన్నవరం, చినబజార్ వీధి నుంచి వెలమవీధి, లక్ష్మమ్మ కోవెలు, కొత్తూరు జంక్షన్, వినాయకుడి గుడి, ఆర్టీసీ కాంప్లెక్స్, దుర్గాదేవి గుడి, పూర్ణా థియేటర్ రోడ్డు మీదుగా తిరిగి చిన బజార్ జంక్షన్ వరకు సారె ఊరేగింపు నిర్వహించారు. బ్యాండ్ మేళాలు, త్రీన్‌మార్ డబ్బుల సందడితో ఊరేగింపు సంబరంగా సాగింది.



గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపులో భక్తులు

ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్

చోడవరం: ఎస్సీ వర్గీకరణ చేయకపోతే ఉద్యమిస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, రెల్లి హక్కుల పోరాట సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎస్సీ ఏబీసీడీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం పోరాటాలు చేసి అనేక మంది బలిదానం అయిన వారికి చోడవరం అంబేడ్కర్ భవనంలో శుక్రవారం పలువురు మౌనం పాటించి, కొవ్వొత్తులతో నివాళులర్పించారు. 30 ఏళ్లకు పైబడి పోరాటం చేస్తున్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయడం వల్ల మాదిగ, రెల్లి కులస్తులకు సముచిత న్యాయం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పెద్దాడ ప్రకాషరావు, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు కండేల్లి వెంకట్రావు, వజ్రభూషణం, రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రతినిధి యర్రంశెట్టి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, రెల్లి హక్కుల పోరాట సమితుల ప్రతినిధులు